క్లుప్తంగా

భగవద్గీతపై క్విజ్ పోటీల విజేతలకు జ్ఞాపికలు



విజేతలకు జ్ఞాపికలు అందిస్తున్న నిర్వాహకులు, గ్రామ పెద్దలు

నిడమర్రు: శ్రీ విష్ణుసాయి జ్ఞానజ్యోతి సంస్థ 26వ వార్షికోత్సవం సందర్భంగా అడవికొలనులోని కేశవస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత క్విజ్ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చక్రవర్తుల సుబ్బారావు మాట్లాడుతూ 26 ఏళ్లుగా ఈ సంస్థ ద్వారా గ్రామాల్లో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు, భగవద్గీతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ పాల వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పాపోలు శేషగిరిరావు, పోశింశెట్టి భవాని తదితరులున్నారు.

పంట నష్టం జాబితా ప్రదర్శన

దెందులూరు: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల ఏలూరు డివిజన్‌లో నష్టపోయిన పంట నష్ట జాబితాను దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో జాబితాల్లో ఏర్పాటు చేశామని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. ఆదివారం దెందులూరు, పెదపాడు మండలాల్లో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసిన జాబితాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. జిల్లా అధికారులు ఫైనల్ జాబితాను అమరావతిలోని రాష్ట్ర కార్యాలయానికి పంపించారన్నారు. అన్ని గ్రామాల్లో బాధిత రైతులు, రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన జాబితాలను చూసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు కోరారు.


దీవెనల పండుగ కరపత్రాల విడుదల



కొవ్వలిలో దీవెనల పండుగ కరపత్రాలను విడుదల చేసిన దృశ్యం

దెందులూరు: కొవ్వలిలోని బేతేలు ప్రార్థనా మందిరంలో ఈ నెల 23 నుంచి 29 వరకు ఉపవాస ప్రార్థన, దీవెనల పండుగ నిర్వహిస్తామని ఫాస్టర్ విలియం అన్నారు. ఆదివారం చర్చిలో దీవెనల పండుగ కరపత్రాలను విడుదల చేశారు. 10 మంది సువార్తీకులు దీవెనల పండుగల్లో సువార్త ప్రకటిస్తారని తెలిపారు. సమీప మండలాల్లో విశ్వాసులు, కొవ్వలిలోని అంబేడ్కర్ నగర్, బేతేలు ప్రార్థనా మందిరంలో నిర్వహించే ఈ దీవెనల పండుగకు హాజరు కావాలని ఆయన కోరారు.

డివైడరుపై మొక్కలు.. వాహన చోదకులకు ఇబ్బందులు



హైవే డివైడర్‌పై బాదంపూడి -ఉంగుటూరు మధ్య పెరిగిపోయిన మొక్కలు

ఉంగుటూరు: జాతీయ రహదారి డివైడరుపై మొక్కలు గుబురుగా పెరిగి రోడ్డుపైకి కొమ్మలు రావడంతో వాహన చోదకులకు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై డివైడరుపై ప్రయాణికుల ఆహ్లాదం కోసం నాటిన మొక్కల సంరక్షణ, నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో గుబురుగా పెరిగాయి. ఈ పొదల్లో పాములు సంచరిస్తున్నాయి. డివైడర్‌ను శుభ్రంగా ఉంచి, మొక్కల కొమ్మలను కత్తిరించాలని పలువురు వాహనాదారులు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలకు పునరంకితం కావాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ గ్లోబల్ యాక్షన్ టీం ద్వారా లయన్స్ ఇంటర్నేషనల్ విధి విధానాలను అర్థం చేసుకొని సేవా కార్యక్రమాలకు పునరంకితం కావాలని లయన్స్ సభ్యులకు జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు సూచించారు. స్థానిక గ్రీన్ సిటీ లోని లయన్స్ జిల్లా భవనంలో ఆదివారం వేణుబాబు అధ్యక్షతన గ్లోబల్ యాక్షన్ టీమ్, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏరియా లీడర్ అంబటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్‌లో సభ్యత్వం పొందటం ఒక సదవకాశమని, సభ్యులందరూ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు విరాళాలు ఇవ్వాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా ప్రతిపాదించిన పి.సుభాష్ బాబు మాట్లాడారు. పూర్వపు జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, మల్టిపుల్ కౌన్సిల్ సర్వీస్ కో -ఆర్డినేటర్ మూల్పూరి ఉపేంద్ర, మొదటి ఉప గవర్నర్ ఎస్‌వీవీఎస్ పాపారావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీపై రైతుల్లో అనాసక్తి

- సంక్షేమ పథకాలు అందక నిరుత్సాహం
- అన్నదాత సుఖీభవ పథకానికి మొండి చేయి
- ఈ పంట నమోదుకు గడువు పెంచుతున్న ప్రభుత్వం
- ముందుకురాని రైతులు



పాతూరులో వరి రైతు ఫొటోను ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేస్తున్న దృశ్యం

భీమడోలు: ప్రభుత్వం నుంచి రైతులకు ఏ సంక్షేమ పథకం అందాలన్న ఈ క్రాప్ నమోదు తప్పనిసరి. మరి ముఖ్యంగా పంటల బీమా, పెట్టుబడి రాయితీ, ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్ట పరిహారం వంటి రావాలంటే రైతులంతా ముందస్తుగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఆరుగాలం పండించిన పంటను విక్రయించుకోవాలన్నా ఈ క్రాప్‌ను విధిగా చేయించుకోవాలి. ప్రభుత్వం పలు సార్లు గడువు తేదీలను పొడిగించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో ఈక్రాప్ నమోదును ఈనెల 25వ తేదీ వరకు పొడిగిస్తూ మరో అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో ఈ పంట నమోదు 98 శాతం పూర్తి కాగా, ఈకేవైసీ 64 మంది మాత్రమే చేసుకున్నారు. ఈకేవైసీ విషయంలో వెనుకబడి ఉంది. రైతుల్లో ఇంతటి అనాసక్తి గల కారణాలు అర్థం కాక వ్యవసాయ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పథకాలన్నీ సకాలంలో రైతుల ఖాతాల్లోకి జమ కావడంతో ఈ క్రాప్, ఈకేవైసీ నమోదుకు రైతులు ఆసక్తిని కనుబర్చేవారు. ఈ ప్రభుత్వం 100 రోజుల పండుగ చేసుకుంటున్నా రైతులకు ఒరిగిందేమీ లేదని వారంటున్నారు. ఈ క్రాప్‌తోపాటు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. వ్యవసాయశాఖ సిబ్బంది వద్దకు వచ్చి బయోమెట్రిక్ వేసి ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలి, అయితే రైతులు సిబ్బందికి అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

మండలం	పంట విస్తీర్ణం	ఈ పంట నమోదు	రైతులు	ఈకెవైసీ నమోదు
భీమడోలు	15,206	15,007	5,169	3,490
ఉంగుటూరు	28,997	27,719	9,923	6,085
ద్వారకాతిరుమల	44,903	44,531	6,302	3,773
నిడమర్రు	3,563	3,543	1,487	1,276

రైతులు ఇవ్వాల్సిన వివరాలు

సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకత కోసం జియోఫెన్సింగ్ విధానాలు అమలు చేస్తూ సంబంధిత రైతు ఫొటో ద్వారా యాప్‌లో నమోదు చేస్తున్నారు. నమోదు ప్రక్రియ ముగియడానికి మరో 10 రోజులు మాత్రమే గడువు ఉంది.

పంట వదిలేసిన రైతులు

భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో భీమడోలు, ద్వారకాతిరుమల, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో 92,669 ఎకరాలకు 90,780 ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తి కాగా, 22,881 మందిలో 14,624 ఎకరాల్లో ఈకేవైసీ పూర్తి చేశారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో భీమడోలు, ద్వారకాతిరుమల, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లోని వరి పంట వర్షాలకు దెబ్బతింది. ఎక్కువగా భీమడోలు మండలంలో నష్టం ఉంది. 250 మందికి రైతులకు చెందిన 220 ఎకరాల్లో పంట దెబ్బతింది. అయినప్పటికీ రైతులు అప్పులు చేసి పైరు తెచ్చుకుని సాగు ప్రారంభించారు. ఇప్పటికే రెండు సార్లు వర్షాలు పంట కోల్పోయిన రైతుల్లో పలువురు 10 నుంచి 15 ఎకరాల పంటను వదిలేశారు. గ్రామాల్లో వరి పంటను వదిలేసి ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లిస్తున్నారు. వివిధ కారణాల రీత్యా పంట వేయనటువంటి రైతులకు తాజాగా ఈకేవైసీ నమోదుకావడం లేదు.

100 రోజుల పాలనలో రైతులకు చేసింది శూన్యం

ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో రెండుసార్లు వర్షాలు రైతులు నట్టేట ముంచాయి. దాంతో రైతులు కోలుకోలేని స్థితికి చేరుకున్నారు. ఎన్నికల హామీల్లో రైతులకు ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకంపై ప్రభుత్వం నుంచి ఊసే లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి రైతుకు రూ.13,500 అందజేయగా కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం రూ.20వేలు ఇస్తానని చెప్పి మొండి చెయ్యి చూపింది. దీనితో సాగు కోసం అప్పులు తెచ్చిన రైతులు, కౌలు రైతులపై రుణ భారం పడింది. ప్రభుత్వం అందించే సాయం కూడా రాకపోవడంతో భరోసా లేని బతుకులయ్యాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఈ క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ చెప్పిన సమయానికి ఎన్ని కష్టాలున్నా రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారని రైతులు అంటున్నారు.

రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి



ఈ క్రాప్ రైతుల పాలిట వరం. ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా అదుకునేందుకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం ఈ క్రాప్ నమోదును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించింది. భీమడోలు మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన వరి వివరాలను ఈ క్రాప్ యాప్‌లో 99 శాతం మంది నమోదు చేసుకున్నారు. 68శాతం మంది రైతులు ఈకై వైసీ చేయించుకున్నారు. రైతులు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలన్నీ చేరుతాయి. ప్రభుత్వం ఇచ్చిన గడువు నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం.

– ఎస్‌వీవీ ఉషారాణి, ఏవో, భీమడోలు

కొనసాగుతున్న డాక్టర్ల నిరసన

దెందులూరు: పీహెచ్‌సీ డాక్టర్ల భవిష్యత్తు కుదించేలా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకునేవరకు విరమించేది లేదని ఏపీ పీహెచ్‌సీల వైద్యుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం రాష్ట్ర యూనియన్ ఆదేశాల మేరకు సమ్మెలో భాగంగా దెందులూరు, పోతునూరు, గోపన్నపాలెం పీహెచ్‌సీల్లో డాక్టర్లు బైక్‌లపై ఫ్లెక్సీలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ వైద్యులంతా సమ్మె ప్రారంభించి వైద్య సేవలు నిలుపుదల చేసి రోడ్లెక్కి ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీల డాక్టర్ల అభివృద్ధికి విఘాతం కలిగించేలా జీవో ఇవ్వడాన్ని ఆవేదన కలిగించిందన్నారు. జీవో ఉపసంహరించుకునేవరకు సమ్మె విరమించేది లేదన్నారు. అనంతరం మండలంలోని మూడు పీహెచ్‌సీల్లోని సమ్మెలో ఉన్న వైద్యులు బైక్‌లపై ర్యాలీగా ఏలూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి వెళ్లారు.

కుటుంబరావు సేవలు మరువలేనివి

దెందులూరు: వైఎస్సార్‌సీపీకి సీనియర్ నేత సరిపల్లి కుటుంబరావు అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం ఖండ్రికనర్సింహపురంలో వైఎస్సార్‌సీపీ సీనియర నేత సరిపల్లి కుటుంబరావు సంస్మరణ సభ జరిగింది. గ్రామ వైఎస్సార్‌సీపీ నేతలు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కనికెళ్ల పెద్దిరాజు, మాండ్రు పెద బాబు, చిలకా హరీష్, పార్టీ నాయకులు, సర్పంచ్ సంతోష్‌కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), కుటుంబరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తొలుత కుటుంబరావు కుటుంబసభ్యులకు సరిపల్లి మహేష్, రమేష్‌ను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఏచూరి, రుద్రరాజుకు ఘన నివాళులు



ఏచూరి, రుద్రరాజుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

నిడమర్రు: ఎర్రజెండా ముద్దుబిడ్డలు సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణరాజు మరణం దేశానికి కార్మిక వర్గాలకి తీరని లోటని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఆర్ లింగరాజు అన్నారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పూర్వ జిల్లా కార్యదర్శి రుద్రరాజు సత్యనారాయణరాజు సంతాప సభ నారాపల్లి రమణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు హాజరైన గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ నేడు దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదంగా ఉన్న కార్పొరేట్ మతోన్మాద బీజేపీని నిలవరించడంలో సీతారాం ఏచూరి ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆయన లేని లోటు దేశానికి, భావితరానికి తీరని లోటన్నారు. అనంతరం ఏచూరి, రుద్రరాజు చిత్రపటాలకు నేతలు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, కంచం ప్రసాదు తదితరులున్నారు.

డైవర్షన్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు

భీమడోలు: డైవర్షన్ రాజకీయాలకు చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ భీమడోలులో ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగం సిద్ధం చేశాయని, అక్కడ కార్మికులు, ఉద్యోగులు ఉద్యమాలు ఉధృతమవుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కల్తీ నెయ్యి పేరుతో డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వారి డైవర్షన్ రాజకీయాలను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఏది జరిగినా జగన్ వల్లే అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుత చంద్రబాబు పాలనలో కల్తీ నెయ్యి ఘటన బహిర్గతం కావడంతో దానిని సైతం జగన్‌మోహన్ రెడ్డికి ఆపాదించడం ఎంత వరకు సమంజసమన్నారు. అనేక పరీక్షల తర్వాతనే నెయ్యిని తిరుపతి లడ్డూ తయారీకి వినియోగిస్తారని టీటీడీ అధికారులు చెబుతున్నా కూటమి నేతలు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. చంద్రబాబు మతం పేరుతో, డిప్యూటీ సీఎం పవన్ కులం పేరుతో రాజకీయాలు చేస్తున్నారన్నారు. కల్తీ నెయ్యికి కారణమైన వారిని ఆ భగవంతుడు శిక్షించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

27న ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు సదస్సు



పోతునూరులో మాట్లాడుతున్న గుత్తికొండ వెంకటకృష్ణారావు

దెందులూరు: ద్వారకాతిరుమలలో ఈ నెల 27న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశం నిర్వహిస్తున్నామని కౌలు రైతులు, రైతులు, సదస్సు జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పిలుపునిచ్చారు. ఆదివారం పోతునూరు రైతు సేవా కేంద్రం సమీపంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. 27న ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమలలోని శ్రీ కృష్ణ యాదవ కల్యాణ మండపంలో రైతు రాష్ట్ర సదస్సు నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథిగా మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభానాద్రీశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, పలువురు నాయకులు పాల్గొంటారన్నారు. జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై తీర్మానాలు చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, దెందులూరు మండల అధ్యక్షుడు గండి రాజా, మునునూరి సూర్యచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి. రామారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యా సంవత్సరం ప్రారంభమై మొదటి త్రైమాసికం పూర్తయినప్పటికీ పదవ తరగతి విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో పబ్లిక్ పరీక్షలు రాసే అవకాశం ఉందో లేదో తెలియక పోవడం శోచనీయమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీ. రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం ఏలూరులోని ఇష్టు కార్యాలయంలో రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని యాజమాన్యాలలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలన్నారు. 40 కిలోమీటర్ల పరిధి దాటి చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్లను రద్దుచేసి ఆ పాఠశాలకు ప్రత్యామ్నాయలను ఏర్పాటు చేయాలని కోరారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర మాట్లాడుతూ నూతన పీఆర్సీని 2023 జూలై ఒకటో తేదీ నుంచి అమలు చేయవలసి ఉన్నందువలన వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పీఆర్‌సీ బకాయిలను, పెండింగ్ డీఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఏపీ జీఎల్ఐ, పీఎఫ్ రుణాలను సకాలంలో మంజూరు చేయాలని కోరారు. ఫైనల్ పేమెంట్లను వెంటనే ఇవ్వాలని, ప్లస్ 2 పాఠశాలలకు ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలని, ఐటీడీఏ యాజమాన్యంలోని ఆశ్రమ పాఠశాలలకు రెండవ ఇంగ్లీషు పోస్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సబ్ కమిటీ సభ్యులు బి.శ్యాంసుందర్, ఎస్.దొరబాబు, కేఎస్ఎస్ ప్రకాష్ రావు, కేఎల్ఎన్ రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి ఎన్.భాస్కర వర్మ, వివిధ మండలాల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ టీచర్ అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ టీచర్ కనిపించకపోవటంతో భర్త ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏలూరు చాటపర్రు రోడ్డులో నివాసం ఉంటున్న నిమ్మగడ్డ నాగేశ్వరరావు లింగపాలెం మండలం నడిపల్లిలో పాస్టర్‌గా పనిచేస్తున్నారు. అతని భార్య బాల స్వాతి (38) ఏలూరు చాటపర్రు రోడ్డులోని ఒక ప్రైవేటు స్కూలు టీచర్‌గా పనిచేస్తున్నారు. భార్య బాలస్వాతి రెండు రోజుల నుంచి కనిపించకపోవటంతో బంధువులను వాకబు చేసినా ఆచూకీ లభించక ఆమె భర్త నాగేశ్వరరావు ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులు సమన్వయంతో సేవలందించాలి

దెందులూరు: అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు సమన్వయం, ప్రణాళికతో విధులు నిర్వహిస్తూ సేవలందించాలని నూరు శాతం ఫలితాల సాధనకు చేయాలని దెందులూరు మండల ప్రత్యేకాధికారి, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. దెందులూరు మండల ప్రత్యేకాధికారిగా నియమితులై మొదటిసారి దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక అధికారి బాధ్యతను స్వీకరించారు. ఆయన్ను ఎంపీడీఓ శ్రీలత, ఉపాధి ఏపీఓ దశరథ రామ్‌జీ, ఏఓ భీమరాజు, ఏఈలు, అసిస్టెంట్ ఇంజనీర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని శాఖల మండలాధికారులతో ఈ వారంలోనే సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు సూచించారు.

తిరుమల తిరుపతి పవిత్రతను కాపాడాలి

భీమడోలు: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలుగా రాజకీయాలకుతీతంగా ఆధ్యాత్మిక పరులను వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన వారిని నియమించాలని గాయత్రీ జిల్లా బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాశీబొట్ల పార్వతీశ్వర శర్మ, కోశాధికారి అమ్మనమంచి మురళీకృష్ణ కోరారు. భీమడోలులో వారు ఆదివారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. తిరుమల తిరుపతి పవిత్రను కాపాడండి, గోసంరక్షణకు కృషి చేయాలని కోరారు.

విద్యార్థులు అడవి బాపిరాజు నుంచి ప్రేరణ పొందాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ చిత్రకారుడు అడవి బాపిరాజు నుంచి విద్యార్థులు ప్రేరణ పొందాలని మైక్రో ఆర్టిస్టులు మేతర సురేష్, వి.ప్రసాద్ అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంస్థల ఆధ్వర్యంలో నవచైతన్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక గాంధీనగర్ హైస్కూల్లో అడవి బాపిరాజు 72వ వర్ధంతి సభ బీజీటీఓ హైస్కూల్ టీచర్ కేవీ అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ నవ చైతన్యం తొమ్మిది రోజుల కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరదలు, ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించారు. పోటీలకు ఏలూరు నగరానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభకు హేలాపురి బాలోత్సవం ట్యూషన్ సెంటర్ల సమన్వయ కర్త కె. జనని స్వాగతం పలికారు. మైక్రో ఆర్టిస్టులు డీ.ప్రసాద్, మేతర సురేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత అడవి బాపిరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మేతర సురేష్ అగ్గిపుల్లలతో చేసిన రామాయణం మైక్రో ఆర్ట్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని జాకబు ఈశ్వరి విజయలక్ష్మి పర్యవేక్షించారు. పోటీ అనంతరం పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు కమిటీ తరపున అందజేశారు.

కోర్టులో దురుసుగా ప్రవర్తించిన నిందితుడు

ఏలూరు టౌన్: హత్యా కేసులో ప్రధాన నిందితుడిగా ఉంటూ కోర్టు వాయిదాకు వచ్చిన సందర్భంలో మద్యం తాగి వచ్చి న్యాయస్థానంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో కోర్టు ఉత్తర్వులు మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2018లో ఏలూరులో ఒక హత్యా కేసులో నిందితుడిగా ఉన్న తూర్పువీధికి చెందిన తిరుమల రామశివ (38) ఏలూరు జిల్లా కోర్టుకు కేసులో వాయిదాలకు వస్తున్నాడు. ఈనెల 13న కోర్టు వాయిదాకు వచ్చిన రామశివ పూటుగా మద్యం తాగి కోర్టులో దురుసుగా ప్రవర్తించాడు. కోర్టు ఆదేశాల మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శిథిలావస్థలో వ్యవసాయ శాఖ కార్యాలయం



శిథిలమైన వ్యవసాయ శాఖ కార్యాలయం

ఉంగుటూరు: స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు సముదాయంలో వ్యవసాయశాఖ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. ఈ కార్యాలయంలో ఏడాది నుంచి కార్యకలాపాలు నిర్వహించడం లేదు. ఇక్కడున్న కార్యాలయాన్ని రైతు భరోసా కేంద్రంలోకి మార్చారు. శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయం 1996లో నిర్మించారు. సుమారు రూ.5 లక్షలు వ్యయంతో నిర్మించిన ఈ కార్యాలయాన్ని అప్పటి వ్యవసాయ శాఖమంత్రి కోటగిరి విద్యాధరరావు ప్రారంభించారు. అప్పటి ఎమ్మెల్యే కొండ్రెడ్డి విశ్వనాథం, అప్పటి వ్యవసాయ అధికారి డాక్టర్ ఎల్‌బీవీ సత్యనారాయణ కృషి చేశారు. వ్యవసాయ కార్యాలయంతోపాటు గిడ్డంగిగా కూడా దీన్ని ఉపయోగించారు. సుమారు 25 ఏళ్లపాటు ఈ భవనంలో వ్యవసాయ శాఖ ఆఫీసు నడిపారు. ఈ భవనం గోడలపై పిచ్చి మొక్కలు పెరిగి బీటలు ఏర్పడ్డాయి. ఈ కార్యాలయం పక్కనే తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలున్నాయి. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సమయంలో రూ. లక్షలతో ఈ రెండు భవనాలకు రంగులు అద్ది కొత్త రూపు తీసుకువచ్చారు. వ్యవసాయ శాఖ కార్యాలయ భవనానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరింది.

విద్యార్థుల భవిష్యత్తుకు క్రీడలు దోహదం

పెదవేగి : విద్యార్థుల భవిష్యత్‌కు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏదొక క్రీడలో ప్రావీణ్యతను సాధించాలని వెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వైవీఎస్ ఆచార్యులు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో 19 ఏళ్ల విభాగం క్రీడాపోటీలు పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో ఆదివారం నిర్వహించారు. క్రీడాపోటీలను ప్రారంభించిన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వైవీఎస్ ఆచార్యులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా క్రీడాకారునిగా ఎదిగితే వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. క్రీడాకారులకు భవిష్యత్లో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం పొందాలని ఆయన సూచించారు. ఆదివారం జరిగిన క్రీడాపోటీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్లను ఎంపిక చేశామని ఎస్జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఈ పోటీల్లో కుస్తీపోటీల్లో బాలురు 20 మంది. బాలికలు పది మందిని ఎంపిక చేశామన్నారు. సాఫ్ట్ బాల్ విభాగంలో 16 మంది బాలురు. 16 మంది బాలికలు, బేస్‌బాల్‌లో 16మంది బాలురు. 16 మంది బాలికలు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. సెపక్ తక్రా పోటీల్లో బాలబాలికలు ఐదుగురు చొప్పున ఎంపికయ్యారని. త్రోబాల్‌లో 12మంది బాలురు. యోగాలో ముగ్గురు బాలురు ఎంపికయ్యారని జయరాజు తెలిపారు. పీడీలు ఈటీలు గురుమూర్తి, విజయలక్ష్మి, రాజా, శ్రీనివాస్, కుమార్, సునీల్, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం

- మాయ మాటలతో మభ్యపెడుతున్న కూటమి నాయకులు
- వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనను గుర్తు చేసుకుంటున్న ప్రజలు

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయ్యింది. నేటికీ ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం ఒక్కపైసా విడుదల చేసిన దాఖలాలు కానరావడం లేదు. కనీసం రెండు వారాల క్రితం వరదల కారణంగా చేపల చెరువులు నీట మునిగి నష్టపోయిన ఆక్వా రైతులు ఆర్థిక సాయం అందలేదు. ముంపుబారిన పడిన నివాసితులను ఆదుకునే ప్రయత్నాలు చేయలేదు. అయినప్పటికీ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేస్తున్నారు. ప్రజల నుంచి పచ్చనేతలకు విముఖతను ఎదుర్కొంటున్నారు.

కానరాని స్పందన

పచ్చ నేతలు గ్రామాల్లో చేపట్టిన మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించిన స్పందన రావడం లేదు. దీంతో నాయకులు సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎం తదితరులతో కలిసి పింఛన్ అందుకుంటున్న వృద్ధుల ఇళ్లకు వెళ్లి ఫొటోలు దిగుతున్నారు. మాదేపల్లి, కోటేశ్వరదుర్గాపురంలో సంక్షేమ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారంటూ ప్రజలు నాయకులను ప్రశ్నించారు. దీంతో కూటమి నాయకులు ప్రజలకు మాయ మాటలు చెబుతూ మభ్య పెడుతున్నారు. ప్రచారానికి వచ్చిన నాయకులు తిరుగుముఖం పట్టిన తర్వాత మహిళలు, రైతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనను చర్చించుకుంటున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అమ్మ ఒడి పథకం నేటికీ చంద్రబాబు అమలు చేయలేదని గుర్తు చేస్తున్నారు. రైతు భరోసా పథకం ఇప్పటికీ విడుదల చేయలేదని రైతులు వాపోతున్నారు. కార్పొరేషన్ల ద్వారా వ్యక్తి గత రుణాలు మంజూరు చేస్తామంటూ నమ్మించి, ఇప్పుడు పట్టించుకోవడం లేదంటూ యువకులు టీడీపీ నాయకులను తిడుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు అందుకున్నామని గుర్తు చేస్తున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే పథకాలు అమలు చేసిన నాడు పుల్ల పెడతారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలన భేష్

కూటమి నాయకులు చేపట్టిన మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆశించిన స్పందన రాలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన ప్రజలు మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యం, పాఠశాల అభివృద్ధి, పాలన భవనాలు మొత్తంగా 404 పనులు చేపట్టి రూ.106.40 కోట్లు ఖర్చు చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు వివరిస్తున్నారు. అమ్మ ఒడి, వైఎస్ఆర్ భరోసా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, పెన్షన్ కానుక, వైఎస్ఆర్ చేయూత, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ తదితర 26 సంక్షేమ పథకాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.175.20 కోట్లకు పైగా పేదలకు అందించారని గుర్తు చేస్తున్నారు.

రహదారులను అభివృద్ధి చేయాలి

ఏలూరు (టూటౌన్): నగరంలోని కండ్రిగగూడెం, తంగెళ్లమూడి ప్రాంతాల్లోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేయాలని తంగెళ్లమూడి సీపీఎం శాఖ మహాసభ డిమాండ్ చేసింది. తాపీమేస్త్రి కాలనీ 8వ రోడ్డులో ఆ పార్టీ శాఖా మహాసభ సీహెచ్ దుర్గారావు అధ్యక్షతన ఆదివారం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం శాఖ కార్యదర్శి బి.జగన్నాథరావు మాట్లాడుతూ కండ్రిగూడెం, తంగెళ్లమూడి ప్రధాన రహదారుల్లో రోడ్లు దారుణంగా ఉన్నాయని ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. పాత పోస్టాఫీసు, దాదా పలావ్ సెంటర్ ప్రాంతంలో ప్రమాదకరంగా రోడ్లు మలుపులున్నాయని, ఇక్కడ స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.త్రినాథ్, బి.శ్రీనివాసరావు, బి.సిద్ధార్థ, పలువురు నాయకులు పాల్గొన్నారు.